క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పి.నైనవరం(విజయవాడరూరల్): పి.నైనవరం గ్రామంలో బుధవారం ఉదయం 7గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందచేసిన వివరాలతో కూడిన బ్రోచర్లను ఎమ్మెల్యే లబ్ధిదారులకు ఇంటింటికీ అందజేస్తారు.ఆ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి పనులు తెలియజేయడంతో పాటు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకుంటారు.

పంపిణీకి అందుబాటులో పెరటి కోళ్లు

విజయవాడ రూరల్: డ్వాక్రా గ్రూపుల్లోని మహిళల ఆదాయాన్ని పెంపుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెరటి (నాటు)కోళ్ల పంపిణీ చేస్తుందని డీఆర్‌డీఏ ఏపీఎం చంద్రశేఖర్ తెలిపారు. ఆయన మంగళవారం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా మాట్లాడారు. యూనిట్ ఖరీదు రూ.4,400 చెల్లించిన వారికి 8 పెట్టలు, 3 పుంజులను ఇస్తారన్నారు. ఇవి సంవత్సరం పొడవునా గుడ్లు పెడతాయని తెలిపారు. వీటి వలన మహిళలు ఆదాయం పెంచుకొని కుటుంబ అవసరాలను తీర్చుకో వచ్చన్నారు. దీంతో ఆర్థికంగా ప్రయోజనం కల్గుతుందన్నారు. ఆసక్తిగల వారు ఏపీఎం చంద్రశేఖర్, 9154054118 ఫోను నంబర్లో సంప్రదించాలని వివరించారు.

పింఛన్‌దారులకు నగదు విడుదల

పెనమలూరు: పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీలోని పింఛన్‌దారులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని ఎంపీడీఓ సునితాశర్మ తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ.. పింఛన్‌దారులు 17,962 మంది ఉండగా ప్రభుత్వం రూ.ఐదు కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. పెనమలూరు మండలంలో 5,568 మందికి రూ.1.54 కోట్లు, తాడిగడప మున్సిపాలిటీలో 12,404 మంది లబ్ధిదారులకు రూ.3.46 కోట్లు విడుదల చేసిందన్నారు. బుధవారం ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తారని చెప్పారు.

పెనమలూరులో యువతి అదృశ్యం

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరు పల్లిపేటకు చెందిన బి.రత్నముఖి కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె కుమార్తె(18) విజయవాడలో ఇంటర్మీడియెట్ చదువుతుంది. జనవరి 29న ఇంట్లో కుటుంబసభ్యులందరూ నిద్రపోయారు. మరలా 30వ తేదీన ఉదయం లేచి చూసుకునే సరికి ఇంట్లో ఉన్న రత్నముఖి కుమార్తె కనిపించలేదు. ఆమె కోసం వెతికినా ఫలితం లేదు. దీంతో యువతి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశారు.

108 వాహనాల్లో ఉద్యోగాల భర్తీకీ దరఖాస్తుల ఆహ్వానం

కంకిపాడు: 108 వాహనాల్లో పనిచేసేందుకు ఆసక్తి చూపే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 సంస్థ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు, గన్నవరం ప్రాంతాల్లో 108 వాహనాల్లో పనిచేసేందుకు ఆసక్తి చూపే అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 89191 97050 నంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రికి బెడ్ బహూకరణ

గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి మంగళవారం గన్నవరానికి చెందిన దాతలు కామినేని శ్రీనివాసరావు, రమేష్, మురళీ, వెంకటకృష్ణారావు సోదరులు రూ.20 వేల విలువైన రిక్‌లెనైర్ బెడ్‌ను బహూకరించారు. తమ తల్లిదండ్రులైన కామినేని రామచంద్రరావు, కమలమ్మ జ్ఞాపకార్థం దాతలు ఈ బెడ్‌ను అందజేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నే సుందరరావు మాట్లాడుతూ..ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం సదుపాయం కలిగిన బెడ్‌ను దాతలు అందజేయడం అభినందనీయమన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వ ఆస్పత్రిలో సదుపాయల కల్పనకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకురావాలని కోరారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సారమ్మ, హెడ్ నర్స్ కొండమ్మ, జోసఫ్, బాబీ పాల్గొన్నారు.

రైల్వే కానిస్టేబుల్ ఆకస్మిక మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: విధి నిర్వహణలో ఉన్న జీఆర్‌పీ కానిస్టేబుల్ యండమూరి శరత్ స్థానిక నూజివీడు రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఆకస్మిక మృతి చెందాడు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణం వెళ్లుతున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో విధులు నిర్వహిస్తున్న శరత్ (42) గుండెనొప్పిగా ఉండటంతో నూజివీడు రైల్వేస్టేషన్‌లో దిగాడు. ఫ్లాట్‌ఫాంపైకి దిగిన కొద్దిసేపటికే ఆయన ఆకస్మాత్తుగా కుప్పకూలిపోవటంతో రైల్వే అధికారులు గుర్తించి, హుటాహుటిన అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చేటప్పటికే శరత్ మృతి చెందినట్లుగా గుర్తించారు. మృతుడు యండమూరి శరత్ ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

కుష్ఠు నివారణపై అవగాహన

గన్నవరం రూరల్: కుష్ఠు నివారణపై అవగాహన కార్యక్రమాలు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన నిర్వహించారు. కుష్ఠు నివారణకు లక్షణాలపై స్వీయ పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి జె.సంధ్య చెప్పారు. మాదలవారి గూడెం గ్రామంలో ఏఎన్ఎం మేరీ గ్రేస్ ఎంపీహెచ్ఈఏ ఎం.సాంబశివరావు ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

- ఎమ్మెల్యే వంశీమోహన్
- ఇందుపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం


ఇందుపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వంశీమోహన్

ఉంగుటూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ నవరత్నాలు అందజేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందజేస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. ఇందుపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ ఇంటింటికి వెళ్లి మూడేళ్లుగా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. ప్రజలు తెలిపిన సమస్యలను నమోదు చేసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వృద్ధులకు, అనారోగ్య బాధితులు, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నవారికి తన సొంత నిధుల నుంచి సాయం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్నావారిని పరామర్శించారు. సాంకేతిక కారణాల వలన సంక్షేమం అందనివారి సమస్యను పరిష్కరించి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మేనిఫెస్టోని పవిత్ర గ్రంథంగా భావించి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, ప్రజలు ఆయన పాలనలో సంతోషంగా ఉన్నారన్నారు. సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఎంపీటీసీలు వెంకట్రామయ్య, ప్రసాద్, చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి, ఎంపీడీవో శేషగిరిరావు, కార్యదర్శి ప్రసాద్, బాలస్వామి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వీధి బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గంగాభవాని


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి గంగాభవాని

గన్నవరం: వీధి బాలలను గుర్తించి పాఠశాలలో చేర్చి వారిని బాధ్యతయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గంగాభవాని పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గంగాభవాని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నిర్బంద విద్యా హక్కు చట్ట ప్రకారం ఆరు నుంచి 14 ఏళ్లలోపు పిల్లలు పాఠశాలలోనే చదువుకోవాలని చెప్పారు. అందుకు విరుద్ధంగా పిల్లలను పనుల్లో పెట్టిన, బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే చట్టరీత్యా నేరమన్నారు. న్యాయవాదులు దాసరి భాగ్యలక్ష్మి, లోకం వేణుబాబు, హెచ్ఎం ఎస్. రవీంద్రభవాని తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ ఉత్సవాలు ప్రారంభం


శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవమూర్తులు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో బుధవారం నుంచి వార్షిక కల్యాణ మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ నెల 5వ తేదీన జరగనున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి రజతోత్సవ కల్యాణాన్ని పురస్కరించుకుని ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. తొలిరోజు ఉత్సవమూర్తులకు అభిషేకాలు, ముత్తైదువులకు గాజుల అలంకరణ నిర్వహించనున్నారు. ఈ నెల 2న గోపూజ, లక్ష పుష్పార్చన, 3న శ్రీవేంకటేశ్వర కల్యాణ గానామృతం, 4న అమ్మవారికి పెళ్లి కుమార్తెగా అలంకరణ, లక్ష కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం మండల దీక్ష ముగింపు, కలశ ఉద్వాసన, అమ్మవారికి సారె సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ తెలిపారు. 5న ఉదయం అఖండ దీపారాధన, కంకణధారణ, గ్రామ పొంగలి సమర్పణ, రాత్రి 8.40 గంటలకు సుముహూర్తంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి రజతోత్సవ కల్యాణం జరుగుతుంది.

అధికారమే లక్ష్యంగా పని చేయాలి


చిరంజీవిని సత్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు

కంకిపాడు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావటమే లక్ష్యంగా పనిచేయాలని ప్రజా ప్రతినిధులు సూచించారు. జగనన్న సచివాలయాల మండల కన్వీనర్‌గా నియమితులైన కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవిని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్ల ఏర్పాటు జరిగిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విషం కక్కుతున్నాయని మండిపడ్డారు. వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్ బాబు, మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సీహెచ్‌సీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, సర్పంచ్‌లు పిన్నబోయిన శ్రీనివాసరావు, కొణతం గిరిధర్, జిల్లా నాయకులు బత్తుల కామేశ్వరరావు, జొన్నలగడ్డ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కనుల పండువగా బాలోత్సవం


కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు


భూతకోల నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థి


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థిని


సమావేశంలో మాట్లాడుతున్న అనగాని

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన బాలోత్సవం కనుల పండువగా జరిగింది. నియోజకవర్గంలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల స్థాయిలో జరిగిన బాలోత్సవంలో సుమారు పదిహేను వందల మంది విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అకడమిక్, కల్చరర్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు సత్తాచాటారు. తొలుత పోటీలను ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ.గౌసాని, తానా మాజీ అధ్యక్షుడు టీబీఆర్. ప్రసాద్ ప్రారంభించారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అతిథులు పేర్కొన్నారు. నిర్వాహణ కమిటీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు గన్నె వెంకట్రావు మాట్లాడుతూ..గత మూడేళ్లుగా ఇక్కడ బాలోత్సవం నిర్వహించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఇప్పుడు ఫలించిందన్నారు. విజేతలకు మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు, షీల్డ్‌లు అందజేశారు. కమిటీ ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్, రోటరీక్లబ్ అధ్యక్షులు చిమట రామారావు, రెడ్‌క్రాస్ అధ్యక్షులు చిన్ని మాధవి, వాకర్స్ అధ్యక్షులు మడుపల్లి బాలకృష్ణమూర్తి, వీకేఆర్ మాజీ ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి, సందానకర్తగా కెఎస్. జగదీశ్వరరావు, పాఠశాల హెచ్ఎం సీహెచ్.అనిత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

మున్సిపల్ కమిషనర్ ప్రకాశరావు


యనమలకుదురులో అవగాహన కల్పిస్తున్న తాడిగడప మున్సిపల్ కమిషనర్ ప్రకాశరావు

పెనమలూరు: యనమలకుదురులో ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎన్. ప్రకాశరావు ఆదేశించారు. ఆయన మంగళవారం గ్రామంలో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. వణుకూరు గ్రామంలో వెంచర్ నాలుగులో యనమలకుదురు గ్రామానికి చెందిన 984 మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. లబ్ధిదారులకు పట్టాలు సైతం అందజేశామని తెలిపారు. ఇళ్ల నిర్మాణం చేసుకునే వారికి యూనిట్‌కు ప్రభుత్వం రూ.1.80 లక్షల ఆర్థిక సాయంతో పాటు రుణ వసతి కూడా కల్పిస్తోందన్నారు. ఇప్పటికే వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకున్నారన్నారు. యనమలకుదురు గ్రామానికి చెందిన లబ్ధిదారులు కూడా ముందుకు వస్తే పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఇళ్ల నిర్మాణం చేసుకునే వారికి ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి బ్యాంకు ఖాతాలో జమ చేస్తోందన్నారు. గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులకు అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

5న ఉచిత కంటి వైద్య శిబిరం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులో ఈ నెల 5వ తేదీన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అన్నపూర్ణ ఏజన్సీస్ అధినేత నూలు నరసింహారావు మంగళవారం తెలిపారు. అశ్విని ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని చెప్పారు. వైద్యులు నిర్ధారించిన వారికి కంటి శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా చేయిస్తామని వివరించారు. కానుమోలు, పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరసింహారావు కోరారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి గ్రామ సచివాలయం–1ను మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలోని సిబ్బంది పనితీరు, హాజరు, ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సేవలను ఆమె పరిశీలించాచారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా పనిచేయాలని చెప్పారు. అనంతరం ఏఎన్ఎంలు, ఆశ వర్కర్స్, అంగన్‌వాడీ సిబ్బందితో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, వార్డు సభ్యులు మూల్పూరి మాధవన్, సీడీపీవో పి.వెంకటలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపద్మావతి పాల్గొన్నారు.

పెయ్య దూడల ఉత్పత్తి పథకంతో లాభం

గన్నవరం: పెయ్య దూడల ఉత్పత్తి పథకం పాడిరైతులకు ఉపయోగకరమని పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశు పునరుత్పత్తి సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ పథకం వల్ల ఎక్కువ పెయ్య దూడలు పుట్టడంతో గ్రామాల్లో పాల ఉత్పత్తులు పెరుగుతాయని చెప్పారు. దీనివల్ల పాడిరైతులు ఆర్థిక పురోభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. జిల్లాలో ఉత్తమ సేవలందించిన పశు వైద్యులను సత్కారించారు. పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ చంద్రశేఖర్, పశుగణాభివృద్ధి సంఘం స్థానిక సీఈవో డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

గన్నవరం రూరల్: విద్యార్థులు లక్ష్యాలు సాధించాలని వాయిస్ ఫర్ గరల్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో కౌమార దశలో బాలికల్లో వచ్చే మార్పులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ ఎం.సౌజన్య అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రతినిధులు మాట్లాడుతూ శారీరక, మానసిక ఆందోళనను అదుపులో ఉంచుకుని అనుకున్న లక్ష్యాలు సాధించాలన్నారు.

3న మెగా జాబ్‌మేళా

ఉంగుటూరు: ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 3న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో సంకల్ప్ పథకం ద్వారా జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్ మేళాలో 15 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఫార్మసీ, బీటెక్ , పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 18–35 సంవత్సరాల వయసు వారు అర్హులని వివరించారు. బయోడేటా, విద్యార్హత పత్రాలతో ఆ రోజు ఉదయం 9గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 90008 73223, 70134 14474 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


వీరమ్మ తల్లికి ఎదురుగండ దీప హారతులు ఇస్తున్న భక్తులు

తల్లీ బయలెల్లినాదే..

- అంగరంగ వైభవంగా వీరమ్మ తల్లి తిరునాళ్ల ప్రారంభం
- ఉత్సవాలకు అంకురార్పణ చేసిన ఎమ్మెల్యేలు పార్థసారథి, అనిల్‌కుమార్


ఉయ్యూరులో అమ్మవారికి తొలి సారె సమర్పిస్తున్న ఎస్ఐ వీరప్రసాద్ దంపతులు

ఉయ్యూరు: వీరమ్మ తల్లి తిరునాళ్ల మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. పారుపూడి, నెరుసు వంశస్తులు ఆచార సంప్రదాయాల ప్రకారం పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పట్టణ ఎస్ఐ ఎస్.వీరప్రసాద్ దంపతులు తొలి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్‌లు మెట్టినింటిలోని శ్రీ కనక చింతయ్య సమేత వీరమ్మతల్లికి ప్రత్యేక పూజలు జరిపించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించారు. ఉపవాస దీక్షతో భక్తులు ఎదురుగండ దీపాలతో హారతులిచ్చారు. అఖండ దీప కాంతులతో ఉయ్యూరు పట్టణం శోభిల్లింది.

కొనసాగిన పోలీసు సంప్రదాయం

తిరునాళ్లలో పోలీసు సంప్రదాయం కొనసాగింది. అనాదిగా వస్తున్న ఆచార సంప్రదాయం ప్రకారం ఉయ్యూరు పట్టణ పోలీసుస్టేషన్‌లో స్టేషన్ అధికారి ఎస్.వీరప్రసాద్ దంపతులు పోలీసుస్టేషన్‌లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసు కుటుంబాలు అన్నీ పసుపు కుంకుమ, చీర సారె, చలువ కావిడితో మేళతాళాలతో ఊరేగింపుగా తరలివెళ్లి రావిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం మెట్టినింటికి చేరుకుని చల్లని తల్లికి పసుపు, కుంకుమ, సారె సమర్పించారు. దీంతో ఉత్సవ పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి.

మార్మోగిన అమ్మ నామస్మరణ..

తిరునాళ్ల తొలి రోజు అమ్మ నామస్మరణతో ఉయ్యూరు మార్మోగింది. మెట్టినింటి నుంచి బయలుదేరిన అమ్మవారికి ఎదురుగండ దీప భక్తులు మెట్టినింటి పరిసరాలు, రావిచెట్టు రోడ్డు, మార్కెట్ సెంటరు, ప్రధాన రహదారి మార్గాల్లో హారతులు ఇచ్చారు. తిరుగుడు గండ దీప భక్తులు అమ్మవారితో పాటు గ్రామోత్సవంలో భాగస్వాములు అయ్యారు. ఉయ్యూరు పట్టణంలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఇంటి ఇంటి వద్దా చల్లని తల్లికి ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా భక్తులు అమ్మా వీరమ్మతల్లి..చల్లంగ చూడమ్మా...కాపాడమ్మా..అంటూ చేసిన నామస్మరణతో పట్టణం మార్మోగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన సెంటరులో పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. జై వీరమ్మ, జైజై వీరమ్మ, వల వలా వలా జై వీరమ్మ అంటూ భక్తులు అమ్మవారి ఊరేగింపు రథంపై పూలవర్షం కురిపించారు. ఎమ్మెల్యేలు పార్థసారథి, అనిల్‌కుమార్‌లు అమ్మవారి హారతిని భక్తులకు ఇచ్చి చల్లని తల్లి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు. డీఎస్పీ కైలే విజయపాల్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, 12 మంది ఎస్ఐలు 256 మంది సిబ్బంది బందోబస్తు చర్యల్లో పాల్గొన్నారు. డీఎస్పీ విజయపాల్ పర్యవేక్షించారు. అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, కంకిపాడు ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

నేడు ఊయల ఉత్సవం

ఊయల ఉత్సవం బుధవారం సాయంత్రం 6 గంటలకు జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ పారుపూడి సుబ్బారావు తెలిపారు. మెట్టినింటి నుంచి బయలుదేరిన అమ్మవారు గ్రామోత్సవాన్ని పూర్తి చేసుకుని ప్రధాన సెంటరులోని ఊయలస్తంభం వద్దకు చేరుకుంటారన్నారు. ఊయల ఉత్సవం అనంతరం ఆలయ ప్రవేశం చేస్తారని తెలిపారు.

గ్రామాల అభివృద్ధే గ్రామదర్శిని లక్ష్యం


పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న విజయవర్ధన్‌రావు

కంకిపాడు: గ్రామాల అభివృద్ధే గ్రామదర్శిని లక్ష్యమని పలువురు అధికారులు పేర్కొన్నారు. మండలంలోని పునాదిపాడు, ఈడుపుగల్లు, మద్దూరు గ్రామాల్లో మంగళవారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. పునాదిపాడు గ్రామాన్ని జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి డి.విజయవర్ధన్‌రావు, ఈడుపుగల్లు గ్రామాన్ని వ్యవసాయశాఖ ఏడీ(గుడివాడ) ఎన్.రమాదేవి, మద్దూరు గ్రామాన్ని బీసీ వెల్ఫేర్ ఈడీ సీహెచ్.లక్ష్మీదుర్గ సందర్శించారు. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, చెత్త సంపద కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలను అధికారుల బృందం సందర్శించింది. ఆయా కేంద్రాలు, కార్యాలయాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి డి.విజయవర్ధన్‌రావు 'సాక్షి'తో మాట్లాడుతూ.. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఆదర్శంగా ఉన్నాయన్నారు. నాడు–నేడు ద్వారా వసతులు మెరుగుపడ్డాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో ఆంగ్ల మాధ్యమం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉందన్నారు. రికార్డులు సమర్థవంతంగా నిర్వహించి సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్‌లు ముసిబోయిన విజయకుమారి, పి.ఇందిర, చిప్పల రామదాసు, ఈఓ బి.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ వి.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ముసిబోయిన వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు చేయాలి

పెనమలూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని మండల ప్రత్యేకాధికారిణి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కేఎస్.జయప్రద ఆదేశించారు. గోసాల గ్రామంలో మంగళవారం గ్రామదర్శిని కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుడికి అందజేయాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో ఇంకా ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వెంటనే వారికి పథకాలు వర్తింపజేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ చేశారు. చిన్నారులకు, తల్లులకు అందుతున్న పోషకాహారాన్ని, రికార్డులు తనిఖీ చేశారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం, పారిశుద్ధ్యం పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో విద్యార్థులకు గోరుముద్ద మెనూ అమలు తనిఖీ చేశారు. వెల్‌నెస్ సెంటర్‌లో మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని రికార్డులు తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బందితో మాట్లాడారు. జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాల పనులు పూర్తి చేయాలన్నారు. సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునితాశర్మ, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఏఈలు నాంచారావు, సత్యనారాయణరాజు, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలించిన జెడ్పీ సీఈఓ

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గ్రామంలో మంగళవారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ సీఈఓ జి.శ్రీనివాసరావు గ్రామంలోని పాఠశాలలు, జగనన్న లేఅవుట్, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్య సేవలు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ పాఠశాలలో రికార్డులు పరిశీలించి నిరంతరం అప్డేటెడ్‌గా ఉండాలని హెచ్ఎం భాస్కర్‌కు సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం నాడు–నేడు, అమ్మ ఒడి, విద్యా దీవెన, నాణ్యమైన ఆహారం అందిస్తుందని, వీటిని సక్రమంగా అందించాల్సిన బాధ్యత హెచ్ఎం, ఉపాధ్యాయులదేనన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పరిశీలించి వైద్య సేవలు సమీక్షించారు. ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, సర్పంచ్ జె.శిరీషా, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.